క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు ఇష్టంగా చదివి.. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది లక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని హాలింగాపురం ఉన్నత పాఠశాల గురువారం పదో తరగతి విద్యార్థులకు విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరహరి, లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ భవానీ యాదగిరి, ఉపాధ్యాయులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: ఎంఈఓ

కొందుర్గు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ గాయత్రి దేవి సూచించారు. గురువారం మండలంలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ స్వాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

షాబాద్: బాధిత కుటుంబాలకు తమ సంఘం అండగా ఉంటుందని శ్రీ మల్లికార్జున కురుమ పొదుపు సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మందుముల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య లక్ష్మమ్మకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కరాటేలో అంతర్జాతీయ పురస్కారం



పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

ఆమనగల్లు: నగరంలోని నాంపల్లి బిర్లా ఆడిటోరియంలో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అవార్డులను అందజేశారు. ఇందులో పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోను అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మధు తదితరులు

మంచాల: చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని సీఐ మధు అన్నారు. గురువారం మండల పరిధి ఆస్మత్‌పూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మరింత రక్షణగా ప్రభుత్వం షీటీం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రత్యేక కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి, బాధితులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేములతో మోసపోవద్దని సూచించారు. డయల్ 100 గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మంచాల: ఇళ్ల స్థలాలు లేక, సొంతింటి కలకు నోచుకోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆగాపల్లి గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో సర్వే నంబర్ 128లో 7–26 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని పేదలను గుర్తించి 60 గజాల చొప్పున అర్హులకు భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, నాయకులు శేఖర్‌గౌడ్, రవి, దేవయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు 'హామీ' వరం

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కొట్టాల నిర్మాణం
- జాబ్‌కార్డు దారులు, మహిళా సంఘాల సభ్యులకు అవకాశం



పశువుల కొట్టం బేస్మెట్

షాబాద్: పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదే విధంగా పశువులు, జీవాల పోషణకు పచ్చగడ్డి పెంపకం, నీటితొట్ల నిర్మాణాలకు ఆర్థికంగా చేయూత అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారితో పాటు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులను అర్హులుగా గుర్తిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు గొల్ల కురుమలకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

యూనిట్ విలువ ఇలా..

పశువుల కొట్టాల నిర్మాణానికి రూ.58 వేల చొప్పున మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. అదే విధంగా మహిళాశక్తి ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, జలసంబాయ్, జలభగీరథ, రూరల్ శానిటేషన్ కింద వివిధ యూనిట్లను నిధులను మంజూరు చేసేలా కార్యాచరణ రూపొందించారు. వేసవిలో జీవాల దాహం తీర్చేందుకు గాను నీటితొట్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. జీవాల సంఖ్య ఆధారంగా నీటితొట్ల నిర్మాణానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

దరఖాస్తు విధానం

పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారి నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకం దారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొంది మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులను మంజూరు చేస్తారు. షాబాద్ మండలానికి 10 యూనిట్లు మంజూరు చేశారు. ఇందులో పశువుల కొట్టాల నిర్మాణానికి 17 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 10 నిర్మాణంలో ఉన్నాయి. మిగతావి పనులు ప్రారంభించ లేదు.

సద్వినియోగం చేసుకోవాలి



పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కొట్టాలు, షెడ్ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధిహామీ జాబ్‌కార్డు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పథకం వర్తిస్తుంది. వందశాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణం చేపడుతారు.

– వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

క్షేత్రస్థాయిలో అవగాహన



మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కలిస్తున్నాం. పశువుల కొట్టాలు, షెడ్ల మంజూరులో గొల్ల కురుమలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. గ్రామస్థాయిలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు మంజూరు చేస్తారు.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

ప్రమాదాల నివారణకు చర్యలు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం



ఎన్కేపల్లి చౌరస్తాలో బొలార్డ్స్‌ను ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

చేవెళ్ల: వాహన ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. గురువారం మండలంలోని పలు రోడ్లపై ఉన్న మలుపులు, యూటర్న్‌ల వద్ద వేగ నియంత్రణ కోసం ట్రాఫిక్ బొలార్డ్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారుల వేగ నియంత్రణ చేసి ప్రమాదాలు జరగకుండా ఈ బొలార్డ్స్ పనిచేస్తాయని చెప్పారు. వీటిని మండలంలోని జాతీయ రహదారి మూడిమ్యాల నుంచి చిట్టెంపల్లి వరకు ఉన్న హైవే రోడ్డు పరిధిలో ప్రమాదాల జరిగే చోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్లాట్లకు రైతుభరోసా ఇవ్వొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: మూడు దశాబ్దాల క్రితం ప్లాట్లుగా చేసి, విక్రయించిన భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని, ఇప్పటి వరకు అక్రమంగా రైతుబంధును తీసుకున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని గండిచెరువు వాసి జక్క పాపిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గండిచెరువు గ్రామం సర్వే నంబర్ 188నుంచి 192,195 పార్ట్, 196,197,201,202ల లోని సుమారు 120 ఎకరాల భూమిని 1992,1993 సంవత్సరంలో లక్ష్మీప్రియా నగర్, శివప్రియానగర్ కాలనీల పేరుతో లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయించారని పేర్కొన్నారు. అలా కొనుగోలు చేసిన ప్లాట్లలో అనుమతుల తీసుకుని పలువురు నిర్మాణాలు చేపట్టారని, అయినప్పటికీ గతంలో ఆ భూములకు రైతుబంధు ఇచ్చారని తెలిపారు. మరలా రైతు భరోసా ఇవ్వనున్నట్లు జాబితాలో పేరు ఉందని వెల్లడించారు. రైతుభరోసా ఇవ్వకుండా నిలిపివేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశానని పాపిరెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని తంగళ్లపల్లిలో లో ఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌గౌడ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌గౌడ్, గ్రామస్తులు నారాయణచారి, రామకృష్ణ, శివకృష్ణ, రమేష్, జంగయ్య, వెంకటయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



అవార్డు అందుకుంటున్న మహేశ్

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కార్యదర్శి దోనాదుల మహేశ్ అన్నారు. లియోక్లబ్, లయన్స్ క్లబ్‌తో పాటు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు, అనేక సామాజిక అంశాలపై అవగాహన సదస్సులు మహేశ్ నిర్వహించారు. అతని సేవలను గుర్తించిన తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ నిర్వాహకులు.. ×యూత్ అండ్ నేషనల్ యూనిటీ అవార్డు–2025'కు ఎంపిక చేశారు. ఈ మేరకు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమలో సిటీజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజ్‌నారాయణ్, హైకోర్టు రిటైర్డ్ జడ్జీ పీఎస్ నారాయణ, ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారంలు మహేశ్‌కు అవార్డు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



షాబాద్: గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యేలు యాదయ్య, శంకర్

షాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారుల జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: చేగూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పారదర్శకంగా వ్యవహరించాలి

కొత్తూరు/కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకే అందజేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలంలోని చేగూరులో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హుల ఎంపికలో అధికారులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. లబ్ధిదారుల అర్హతలనే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ప్రజాక్షేత్రంలో సభలు నిర్వహిస్తూ నిజమైన అర్హులకే ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కేశంపేట మండలంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించి, గ్రామసభల్లో పాల్గొన్నారు.

జోరుగా గ్రామ సభలు

అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హాజరై దరఖాస్తులు స్వీకరించారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిలలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ వెంకయ్య, మండల ప్రత్యేకాధికారి సురేశ్ బాబు పాల్గొన్నారు. కొందుర్గు మండలంలోని తంగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఎంపీఓ లాలయ్య హాజరయ్యారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గాలిగూడలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కమిషనర్ అమరేందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు సరిపడా కార్మికులు లేకపోవడంతో గడిచిన రెండేళ్లుగా హరితహారం, ప్రైవేటు కాంట్రాక్టు పేరుతో సుమారు 50 మంది కార్మికులతో పలు రకాల పనుల చేయిస్తున్నారని పేర్కొన్నారు. వేతనాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా కౌన్సిల్ తీర్మానం చేయించాలని కమిషనర్‌ను కోరారు. చెత్త సేకరించే వారికి ఒక్కో ఇంటికి రూ.150 చొప్పున ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం నేతాజీ

- దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు
- రాజకీయ, యువజన సంఘాల నేతలు
- సుభాష్ చంద్రబోస్‌కు ఘనంగా నివాళి



మొయినాబాద్‌రూరల్: నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్ తదితరులు

మొయినాబాద్ రూరల్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ యువతకు ఆదర్శమని నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు మల్లని మహేశ్ అన్నారు. గురువారం ఎత్‌మార్‌పల్లిలోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మాల యాదగిరి, సభ్యులు, గ్రామ యువకులు, పాండుగౌడ్, గోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

కొత్తూరు: పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సిద్ధాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం తన డబ్బులతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపాల్, నాయకులు జంగయ్య, ఖాజా, లింగం, శివానంద్, గణేశ్, రమేశ్, మల్లేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: బ్రిటిష్ పాలకులను ధైర్యంగా ఎదిరించిన పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్ సర్వర్‌పాషా, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, వన్నాడ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

మొయినాబాద్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ల ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అనంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరోత్తంరెడ్డి, రామకృష్ణగౌడ్, రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లు ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు, యువకులు ఉన్నారు.



కొత్తూరు: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు



షాద్‌నగర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మొయినాబాద్: పెద్దమంగళారంలో నేతాజీ విగ్రహం వద్ద నాయకులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దూసకల్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం

షాద్‌నగర్: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిమాన్స్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, న్యూరో సైన్స్ ప్రతినిధి డాక్టర్ దవళ శుక్లా అన్నారు. ఈఅంశంపై మండల పరిధిలోని దూసకల్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం



ఆచారికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 30,31 తేదీలలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. కార్యక్రమంలో పాల్గొనాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని ఆహ్వానిస్తూ.. గురువారం గౌడసంఘం నాయకులు అల్లాజీగౌడ్, గంగా రవీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్‌లు ఆహ్వాన పత్రిక అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కౌన్సిలర్లు విక్రంరెడ్డి, లక్ష్మణ్, సంఘం నాయకులు నారాయణగౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

ఆమనగల్లు: ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా చేయాలని, రైతులందరికీ రైతుభరోసా అందించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు ఉన్నవారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఇదే విషయమై ప్రజలు గ్రామ సభల్లో అధికారులను నిలదీస్తున్నారని, వారు సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, రఘు, వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, యాదయ్య, జగన్, సైదులు, గణేశ్, మహేశ్ నేత తదితరులు ఉన్నారు.